

ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 36.0

కనిష్ఠం : 24.0

రేషన్ కార్డుల విభజనకు బ్రేక్

ఏలూరు రూరల్, అక్టోబరు 4: రేషన్‌కార్డుల విభజన ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రేషనైలేజేషన్ చేయవద్దని ఆ శాఖ కమిషనర్ ఆదేశించారు. జిల్లాలో పది రోజుల క్రితం రేషన్ కార్డుల విభజన ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ చౌక దుకాణాల్లో 400 రేషన్ కార్డులు ఉండేలా విభజించాలని ప్రభుత్వం జీవో ఇచ్చింది. పట్టణాల్లో 600 కార్డులు, కార్పొరేషన్‌లో 800 ఉండేలా విభజన చేయాలని ఆదేశించింది. మండలాల్లో తహసీల్దార్లు, కార్డుల విభజనలకు పూనుకున్నారు. దీనిని రేషన్ డీలర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్డుల విభజనపై పునఃపరిశీలన చేయాలని, డీలర్లకు ప్రస్తుత ధరల ప్రకారం సాధారణ జీవనానికి ఇబ్బంది లేకుండా డిపో నిర్వహణ ఖర్చులు పోను కనీస రూ.20 వేలు ఆదాయం తగ్గకుండా వచ్చేలా ప్రతి రేషన్ షాపునకు 600 నుంచి 850 కార్డులు ఉండేలా చేయాలని, మండలం యూనిట్‌గా కార్డులు సమంచేసి ప్రతి డీలర్‌కు న్యాయం చేయాలని ఇటీవల రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజులపాటి గంగాధర్‌రావు అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. కొందరు డీలర్లు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారు. రేషన్ డీలర్ల అభిప్రాయాలు తీసుకోకుండా విభజన చేయవద్దంటూ హైకోర్టు పేర్కొవడంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. జిల్లాలో 1100కు పైగా ప్రభుత్వ చౌకధరల దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డుల విభజన జరిగితే అదనంగా మరో 140 కొత్తగా ఏర్పాటు అవుతాయని భావించారు. రేషన్ డీలర్లు వ్యతిరేకతతో ఈ ప్రక్రియకు అడ్డుపడింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలుపుదల చేయాలని ఆ శాఖ కమిషనర్ ఆదేశించారు.



బంగారు కాంతులతో శ్రీవారి గర్భాలయం

ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి గర్భాలయం పసిడి కాంతులతో మెరుస్తోంది. బంగారు రేకులతో శిల్పకళ ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీనికి కోటీ 64 లక్షల రూపాయలు ఖర్చు అయినట్లు దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ కంపెనీ యాజమాన్యం తెలిపింది.



గాయత్రీమాతా నమోస్తుతే

జిల్లాలోని అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న శ్రీ దేవి నవరాత్రులు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

మద్యం..యుద్ధం!



దుకాణాల కోసం వేట

- ఇప్పటివరకు 115 దరఖాస్తులు
- రాబోయే రెండు రోజుల్లో దరఖాస్తుల వెల్లువ
- ఇప్పటికే అర్ధరాత్రి భేటీలు
- వాటా.. కోటా తేలకపోతే అంతే సంగతి
- ప్రభుత్వం ఆశిస్తున్న దానికి భిన్నంగా వ్యవహారం



ఏలూరు జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు చేజిక్కించుకోవడానికి క్రమేపీ దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. చివరి మూడు రోజుల్లోనే ఈ సంఖ్య అమాంతం దూసుకుపోయే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, వారి మద్దతుదారులు తమ నియోజకవర్గాల్లో ఎవరెవరు దుకాణాలపై దృష్టిపెట్టారు.. మరెవరెవరు సిండికేట్‌గా మారి వ్యాపారాన్ని దక్కించుకోవాలనుకుంటున్నారనే దానిపై ఆరా ఆరంభమైంది. శుక్రవారానికి జిల్లాలోని 144 షాపులకు గాను 115 దరఖాస్తులు అందాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

వాస్తవానికి గతంతో పోలిస్తే ఈసారి మద్యం విధానం పూర్తిగా మారింది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దుకాణాలు ఇప్పుడు ప్రైవేటు చేతిలోకి వస్తున్నాయి. మద్యం వ్యాపారంలో ఏడాదికి భారీ ఎత్తున లైసెన్సుఫీజు వసూలు చేస్తున్నా దీనిని ఏ మాత్రం ఖాతరు చేయకుండా దరఖాస్తులకే ఆరాటపడుతున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లితో పాటు మరికొన్ని ప్రాంతాల్లోని 13 దుకాణాలకు మాత్రం రెండేళ్ల లైసెన్సుఫీజు అత్యల్పంగా నమోదైంది. మిగతావన్నీ 65 నుంచి 71.50 లక్షల వరకు రాబోయే రెండేళ్లల్లో చెల్లించాల్సిందే. ఈ లెక్కన ఇప్పుడు వ్యాపార అంచనాలు ఎలా ఉండబోతున్నాయో నిర్ధారించుకుని మరీ కసరత్తు చేస్తున్నారు.

వ. సంఖ్య	కేంద్రం	షాపుల సంఖ్య	లైసెన్సు ఫీజు (2024-25) రూ.లక్షల్లో	లైసెన్సు ఫీజు (2025-26) రూ.లక్షల్లో
1.	ఏలూరుకార్పొరేషన్	21	65	71.50
2.	ఏలూరురూరల్	5	65	71.50
3.	దెందులూరు	4	65	71.50
4.	పెదపాడు	5	65	71.50
5.	పెదవేగి	6	65	71.50
6.	చింతలపూడి	2	55	60.50
7.	చింతలపూడి మండలం	3	65	71.50
8.	కామవరపుకోట	4	65	71.50
9.	లింగపాలెం	4	65	71.50
10.	టి.నర్సాపురం	3	65	71.50
11.	భీమడోలు	7	65	71.50
12.	ద్వారకాతిరుమల	5	65	71.50
13.	ఉంగుటూరు	7	65	71.50
14.	నిడమర్రు	3	65	71.50
15.	జంగారెడ్డిగూడెం	11	65	71.50
16.	చాట్రాయి	2	65	71.50
17.	ముసునూరు	3	65	71.50
18.	పోలవరం	3	55	60.50
19.	కొయ్యలగూడెం	5	65	71.50
20.	ఆగిరిపల్లి	4	65	71.50
21.	కైకలూరు	8	65	71.50
22.	కలిదిండి	5	65	71.50
23.	కుక్కునూరు	1	55	60.50
24.	నూజివీడు రూరల్	4	65	71.50
25.	మండవల్లి	3	55	60.50
26.	నూజివీడు	3	65	71.50
27.	ముదినేపల్లి	5	65	71.50
28.	జీలుగుమిల్లి	2	55	60.50
29.	కుక్కునూరు మండలం	1	55	60.50
30.	వేలేరుపాడు మండలం	1	55	60.50
31.	బుట్టాయిగూడెం	4	65	71.50

అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా

గడిచిన ఐదేళ్లల్లో మద్యం విధానంతో కొందరు విసుగెత్తిపోయారు. ప్రభుత్వం ఆధీనంలో సాగిన మద్యం వ్యాపారం ఏకపక్షంగా జనంమీద రుద్దేశారు. చౌకబారు బ్రాండ్‌లు తెచ్చి.. తాగాల్సిందేనంటూ ఒత్తిళ్ళు చేశారు. అనేక బ్రాండ్‌లు ఐదేళ్ల క్రితమే మాయమైపోయాయి. ఇంకొన్ని అసలు మార్కెట్‌లో వచ్చినట్టే వచ్చి అర్ధాంతరంగా కనుమరుగయ్యాయి. మద్యం ప్రియులు ఎక్కువగా ఇష్టపడే బ్రాండ్‌లన్నింటిని గొంతు నులిమేశారు. ఈ రకంగా గత ఐదేళ్ల ఏకపక్షం లిక్కర్ బిజినెస్ సాగింది. చీప్ లిక్కర్ విషయంలోను దగా చేశారు. గత 2014-19 మధ్య ఉన్న చీప్‌రకం మద్యం ధరలను అమాంతం పెంచేసి జేబులకు చిల్లుపెట్టారు. ఇప్పుడా పరిస్థితి మారబోతుంది. కొత్త మద్యం విధానం అమలులోకి వచ్చింది. ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. ముంపు మండలాల్లో దుకాణాల సంఖ్యను అత్యల్పంగా నిర్ణయించడమే కాకుండా దీనికి సమాంతరంగా అక్కడ లైసెన్సు ఫీజులను మిగతా ప్రాంతాల కంటే తక్కువగా ఉండేలా జాగ్రత్తపడ్డారు. కుక్కునూరు, వేలేరుపాడుల్లో కేవలం మూడు దుకాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. చింతలపూడి నగర పంచాయతీలోను మినహాయింపు వర్తింప చేశారు. ఇక్కడ కేవలం రెండు దుకాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చి లైసెన్సు ఫీజును రూ.55-60.50 లక్షలుగా రెండేళ్ల కాలంలో నిర్ధారించారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని జనాభా సంఖ్యతో పోలిస్తే నిర్ధారించిన విధానం అందరినీ ఆశ్చర్యపరిచింది. పోలవరం, మండవల్లి, జీలుగుమిల్లి మండలాల పరిధిలోని ఎనిమిది మద్యం దుకాణాల్లో లైసెన్సు ఫీజు కనిష్ట స్థాయిలోనే ఉంచారు. వాస్తవానికి ఇదంతా నోటిఫికేషన్ ముందే కొంత చిలువలు పలువలుగా ప్రచారం సాగింది. ఇప్పుడు కొన్నిప్రాంతాలు మినహాయించి జిల్లా వ్యాప్తంగా 144 దుకాణాల్లో ఫీజు వ్యత్యాసం వెల్లడైంది. దీంతో ఇప్పుడు దరఖాస్తులు మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లోనే నమోదవుతుండడంతో ఎవరెవరు ఈ వ్యాపారంలో అడుగు పెడుతున్నారో తెలుసుకోవడంలోనే రాజకీయపక్షాల్లో ఆతృత కనిపిస్తోంది. ఇప్పటికే 115 దరఖాస్తులు ప్రభుత్వానికి చేరాయి.

యుద్ధంలా తలపడుతున్నారు..

నూజివీడు, ఏలూరు, కైకలూరు పరిధిలో మద్యం దుకాణాల కోసం అనేక మంది యుద్ధంలో తలపడినట్టుగా వ్యవహరిస్తున్నారు. పైపైకి అంతా సజావుగా సాగుతున్నట్టే అనిపిస్తున్నా లోలోన అందరి మధ్య ఒక విధమైన టెన్షన్ నెలకొంది. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తుకు గడువు ఉంది. ఈనెల 11న దుకాణాలకు లాటరీ తీస్తారు. దీనికి ముందే దరఖాస్తు ఫీజు రెండు లక్షలుగా ఉన్నా ఏ మాత్రం ఖాతరు చేయకుండా పెద్ద ఎత్తున దరఖాస్తులు ప్రభుత్వానికి చేరబోతున్నాయి. కొల్లేరు ప్రాంతానికి చెందిన కొందరు కొన్ని దుకాణాలనైనా దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఏలూరు నగరంలోను మద్యం వ్యాపారానికి తిరుగులేని పరిస్థితులు ఉండడంతో ఆ మేరకే దరఖాస్తుల సంఖ్య భారీగా పెరగగలదని అంచనా వేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్, ఏలూరు రూరల్ పరిధిలోని 26 దుకాణాల్లో వ్యాపారం జోరుగా ఉంటుందని కొందరు ఓ అంచనాకు వచ్చి ఆ మేరకే సిండికేట్‌గా మారే ప్రయత్నం చేస్తున్నారు. అధికార పక్షం అండదండలు ఉంటేనే ఈ వ్యాపారం సజావుగా సాగుతుందన్న వాస్తవానికి దగ్గరగా వెళ్ళి తీరాల్సిందేనని ఇంకొందరు భావిస్తున్నారు. ఈ మేరకు కొందరి నేతలతో సంప్రదింపులు చేస్తున్నారు. ప్రత్యేకించి నగర పంచాయతీల్లో జంగారెడ్డిగూడెంలో ఉన్న డిమాండ్ దృష్టిలో పెట్టుకుని అక్కడ కూడా లోతట్టుగా వాటా.. కోటా.. అమలు చేయబోతున్నారు. ఇలా రాబోయే రెండు రోజుల్లోనే మద్యం వ్యాపారంలో ఇప్పటికే ఆరితేరిన వారు, కొత్తగా ప్రవేశిస్తున్న వారు పరస్పర సహకారంతో ఒకే మాటకు రానున్నట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితే ఉంటే ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండిపడినట్టే. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం లిక్కర్ వ్యవహారాల్లో మితి మీరి జోక్యం చేసుకోవద్దంటూ పరోక్ష సంకేతాలు అధికార పక్షానికి అందాయి. అయితే ఇదే వర్గానికి చెందిన చాలా మంది ఇంతకుముందు నుంచే మద్యం వ్యాపారంతో సత్సంబంధాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఊహించిన దానికంటే మద్యం దుకాణాల దరఖాస్తు రుసుం ద్వారా వచ్చే ఆదాయం తగ్గుదలగానే ఉంటుందని, అంతకంటే మించి పెరిగే అవకాశాలు లేవని ఇంకొందరు అంచనా వేస్తున్నారు. స్వేచ్ఛగా దుకాణాల నిర్వహణకు వీలుగా దరఖాస్తులు వెల్లువెత్తితేనే ప్రభుత్వం ఆశించినట్టుగా దరఖాస్తుల రూపంలో మరింత ఆదాయం లభించే పరిస్థితి. కాని దీనికి భిన్నంగా వాటా-కోటా రూపంలో వ్యవహారం సాగితే ప్రభుత్వం ఊహించిన దానికి భిన్నమైన పరిస్థితే.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి.. చిత్రంలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జేసీ ధాత్రిరెడ్డి

స్వర్ణాంధ్ర లక్ష్యంగా .. విజన్ డాక్యుమెంట్-2047

భేషుగ్గా జిల్లా విజన్ ప్రణాళిక : మంత్రి కొలుసు

ఏలూరుసిటీ, అక్టోబరు 4 : స్వర్ణాంధ్ర 2047 ఏపీ విజన్ అజెండాతో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రం రూపకల్పనలో భాగంగా వచ్చే ఐదేళ్లకు జిల్లా స్థాయి దార్శనిక పత్ర రూపకల్పన కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2047 విజన్‌ను అభివృద్ధి చేసేందుకు సమగ్ర కసరత్తు చేపట్టింది. స్వర్ణాంధ్ర 2047 విజన్ పత్రం ఆర్థికాభివృద్ధి, సామాజికాభివృద్ధి, పర్యావరణ, సుస్థిరతలపై దృష్టి సారిస్తూ 2047 నాటికి భారత దేశానికి ఆంధ్రప్రదేశ్ వృద్ధి కేంద్రంగా మార్చడానికి కావాల్సిన ప్రణాళిక, కార్యాచరణను నిర్దేశిస్తుంది. స్వర్ణాంధ్ర 2047 పత్రాన్ని ఈ ఏడాది నవంబరు 1న విడుదల చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ దీర్ఘకాలిక ప్రయత్నంలో భాగంగా ముందడుగు వేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల స్థాయిలో రాబోయే ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంతో అద్భుతంగా రూపొందించారు. ఈ విజన్‌ను ఆచరణ సాధ్యం చేయడానికి అందరి సమష్టి కృషి ఎంతో అవసరమన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), డా. కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగించుకోవడంతో పాటు మౌలిక సదుపాయాలు ద్వారా జిల్లా అభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజల అభిప్రాయాల సేకరించడంతో పాటు, ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రతినిధుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి మెరుగైన నివేదిక సమర్పిస్తామన్నారు. డీఎఫ్‌వో రవీంద్ర దామా, సీపీవో శ్రీదేవి, ఆర్డీవోలు అద్దయ్య అచ్యుత అంబరీష్, వాణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మంచి సూచనలు అందించండి..

ఆంధ్రప్రదేశ్‌ను పేదరిక రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ రాష్ట్రంగా రూపొందించడానికి చేపట్టిన స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు ప్రతి ఒక్కరు మంచి సూచలను అందించాలని మంత్రి కొలుసు అన్నారు. కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దేశంలోనే ముందు స్థానంలో నిలిపేందుకు స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికతో ముదుకు వెళుతున్నారన్నారు. స్వర్ణాంధ్ర- 2047 క్యూ ఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి అందులో సూచించిన అభివృద్ధి సూచిక అంశాలలో ప్రజలు తమ అభిప్రాయాలను తెలపాలన్నారు.

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకూడదని మంత్రి కొలుసు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, పౌరసరఫరాల అధికారులతో జేసీ ధాత్రిరెడ్డితో కలసి మంత్రి సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో తేమ శాతం విషయంలో ఒకే సారి తేమ కొలిచే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్ తో పాటు మిల్లర్ల అసోసియేషన్ తరపున ఒకరిని ఉంచాలన్నారు. ధాన్యం రవాణా చేసి ప్రతి లారీలో ఖచ్చితంగా టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. గోనె సంచుల సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశ్రామిక వెనుకబాటు

- పశ్చిమలో ఐదేళ్లుగా ఈ రంగం కుదేలు
- ఏపీఐఐసీ చైర్మన్‌గా రామరాజు నియామకం.. నేడు బాధ్యతల స్వీకరణ
- జిల్లాలో పరిశ్రమలకు మార్గం సుగమం



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉండి ఎమ్మెల్యే సీటును త్యాగం చేయడంతో పార్టీ అధినేత చంద్రబాబు రామరాజుకు ఈ బాధ్యతలు అప్ప గించారు. ఐదేళ్లుగా పారిశ్రామికంగా వెనుకబడిన పశ్చిమ ఈ నియామకంతో ప్రగతి సాధిస్తుందని జిల్లా వాసులు భావిస్తున్నారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తగిన వసతు లున్నాయి. ప్రధానంగా ఫుడ్ ప్రొసెసింగ్ యూ నిట్‌ల ఏర్పాటుకు ఆస్కారం ఉంది. అందుకు తగ్గ ఉత్పత్తులు మెండుగా ఉన్నాయి. ఆక్వా రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పా టుకు మంచి అవకాశంగా భావిస్తున్నారు. ఇప్ప టికే ప్రైవేటు రంగంలో ఎగుమతుల కేంద్రా లు విస్తరించాయి. రాయితీతో మరిన్ని యూనిట్‌లు ఏర్పాటుకు రామరాజుతో సాధ్యపడనుంది. మరో వైపు ధాన్యం ఉత్పత్తులు జిల్లాలో మెండుగా ఉన్నాయి. సార్వా, దాళ్వా సాగులో వరి ఉత్పత్తి అవుతోంది. వరి రంగంలోనూ ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్‌లకు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు సాగాయి. ప్రధానంగా రైస్‌బ్రాన్ ఆయిల్ యూనిట్ల ఏర్పాటుకు ప్రయ త్నాలు చేశారు. అవి నెరవేరలేదు. వైసీపీ అధి కారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రంగం పూర్తిగా దెబ్బతింది. జిల్లాలో ఆక్వా రంగం కుదేలైంది. రైతులు దెబ్బ తిన్నారు. ప్రాసెసింగ్ యూనిట్‌లు నష్టాల్లో కూరుకుపోయాయి. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం కరువైంది. మరోవైపు పారిశ్రామిక పట్టణంలో గుర్తింపు పొందిన తణుకు పట్టణం విస్తరణ నిలిచిపోయింది.

కూటమిలో రాయితీలో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక రాయితీలు మెరుగయ్యాయి. ఇటీవల పారిశ్రామిక రంగంలో దాదాపు రూ.3.8 కోట్లు ప్రభుత్వం రాయితీ మంజూరు చేసింది. చిన్న పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సా హం ఇచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అండదండలుగా ఉంటోంది. రైస్ మిల్లింగ్ పరిశ్రమ కష్టాల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో సవ్యంగా బిల్లులు ఇవ్వలేదు. పెండింగ్ బిల్లుల మంజూ రుకు కమీషన్‌లు గుంజుకున్నారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమ వృద్ధిపైనే జిల్లా రైతుల పురోగతి ఆధారపడి ఉంటుంది. ఆక్వా వ్యర్థాలతో ప్రోటీన్ తయారు చేసేలా గతంలో జిల్లా అధికారులు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేశారు. కూటమి రాకతో మళ్లీ కదలిక వస్తుందని ఆశిస్తున్నారు.

కొత్త అధికారులు బాధ్యతల స్వీకరణ

నూజివీడు డీఎస్పీగా ప్రసాద్..



నూజివీడు టౌన్/ నూజివీడు/ఏలూరు సిటీ, అక్టోబరు 4 : నూజివీడు డీఎస్పీగా కె.వి.వి.ఎస్.వి ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడలో పనిచేస్తున్న ఆయనను నూజివీడు డీఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా, ఈ సందర్భంగా నూజివీడు పట్టణ, రూరల్ సీఐలు సత్యశ్రీనివాస్, రామకృష్ణ డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

నూజివీడు ఆర్డీవోగా వాణి..



నూజివీడు ఆర్డీవోగా శుక్రవారం ఎం.వాణి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆర్డీవోగా పనిచేసిన వై.భవానిశంకరి తాడేపల్లిగూడెంకు బదిలీ కాగా ఆమె స్థానంలో మచిలీపట్నం ఆర్డీవోగా పనిచేస్తున్న వాణిని సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడుకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఆర్డీవో వాణి కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిసి అనంతరం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యా యంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానన్నారు. డివిజన్‌లోని మండలాలను సంద ర్శించి అక్కడ సమస్యలపై పూర్తి అవగాహనకు వచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు.

డ్వామా పీడీగా సుబ్బారావు..



ఏలూరు జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా కె.వెంకట సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఈడీగా పనిచేస్తున్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లా డ్వామా పీడీగా నియమించింది. ఈ మేరకు డ్వామా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డ్వామా సిబ్బంది పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు.

జిల్లా అదనపు ఎస్పీగా సూర్యచంద్రరావు



ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఎస్.సూర్యచంద్రరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో పని చేస్తున్న ఐదుగురు అదనపు ఎస్పీలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ విభాగంలో అదనపు ఎస్పీగా ఉన్న సూర్యచంద్రరావును ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించారు. 1989 ఎస్ఐ బ్యాచ్‌నకు చెందిన సూర్యచంద్రరావు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేశారు. అనేక కేసులను ఛేదించి పోలీస్‌శాఖలో మంచి పేరు తెచ్చుకున్నారు. జిల్లాలో ఎస్ఈబీ అదనపు ఎస్పీగా పనిచేసి అనేక పేకాట స్థావరాలపై అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణాపై దాడులు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలోనే డీజీపీ ద్వారా అవార్డులను పొందారు. అనంతరం ఆయనను సీఐడీ విభాగం అదనపు ఎస్పీగా నియమించారు. తిరిగి జిల్లా అదనపు ఎస్పీ నియమించారు. దీంతో ఆయన శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు.



పునరావాస గ్రామాల్లో పెరటి మొక్కల విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త కరుణశ్రీ

పెరటి తోటల పెంపకంతో ఉపాధి

కేంద్రీయ విద్యాలయం శాస్త్రవేత్త కరుణశ్రీ

పోలవరం, అక్టోబరు 4: పెరటి తోటల పెంపకంతో పోలవరం ప్రాజెక్టు పునరావాస కాలనీల ప్రజలు ఉపాధి పొందవచ్చని కేంద్రీయ విద్యాలయం శాస్త్రవేత్త కరుణశ్రీ అన్నారు. కేంద్రుకోట పునరావాస కాలనీలో శుక్రవారం పెరటి మొక్కల విత్తనాలు పంపిణీ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులు ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి పరిస్థితులు పరిశీలించిన కేంద్రీయ విద్యాలయం వారికి ఉపాధి అందేవిధంగా పెరటి తోటల విత్తనాల పంపిణీకి సంకల్పించిందని, ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పంపిణీ చేయడం సంతృప్తికరంగా ఉందన్నారు. శాస్త్రవేత్త ప్రసాద్ మాట్లాడుతూ పునరావాస గ్రామాల ప్రజల ఆర్థికాభివృద్ధికి ఉపాధి, ఫలసాయం పొందేవిధంగా సహకరించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. 250 మందికి వంగ, చిక్కుడు, టమాట, బీర, ఆనప, గోరు చిక్కుడు, కాకర కందులు, మినుములు 12 రకాల విత్తనాల కిట్లను పునరావాస గ్రామాల ప్రజలకు అందజేశారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్, సర్పంచ్ పైదా నాగరాజు, బొత్త ముక్కయ్య, తామా రాజు, సింహాచలం, రంగరాజు, ఫిలోమెన్ గ్రామ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజకుల వృత్తి చెరువులపై ప్రభుత్వం స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, అక్టోబరు 4: రజకుల వృత్తిపరమైన చెరువుల విషయంలో ప్రభుత్వం స్పందించాలని చెరువుల లీజు నిర్ధారణలో జీవోలను సక్రమంగా అమలు చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. సంఘ భవనంలో శుక్రవారం జిల్లా నేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ అయ్యవరంలో రజక వృత్తిదారులకు కేటాయించిన యర్రికుంట చెరువుకు మోటారు బోరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, రూ.10లక్షలతో విశ్రాంతి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వృత్తిచెరువుల వద్ద ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని, చెరువులు సమగ్ర సర్వేచేయించి ఫలసాయానికి హద్దులు నిర్ణయించాలని కోరారు. కె.వెంకటేశ్వర్లు, ఎస్.మహాలక్ష్మి, మంగాదేవి, రాచూరి సుబ్బారావు, శ్రీనివాసరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న దళిత, గిరిజన సంఘాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 4: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని అలుగు ఆనంద శేఖర్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. డీఎస్పీ రవిచంద్ర ఘటనా స్థలానికి చేరుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపించి నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. విరిగిన చూపుడు వేలును సరిచేయించారు. తొర్లపాటి శ్రీనివాసరావు, నాగు, పంతగాని వెంకన్న, గంజి వినోద్, మానుకొండ కిశోర్, వెంపా ఐజీ, కాటం డేవిడ్, మొడియం శ్రీనివాసరావు, ప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏకపక్ష ప్రణాళికను రద్దు చేయండి



ఆందోళన చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 4: ఎల్ఐసీలో కీలక పాత్ర వహిస్తున్న ఏజెంట్లతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా యాజమాన్యం ఏకపక్షంగా కొత్త ప్రణాళికను ఆమోదించడాన్ని ఏజెంట్స్, వర్కర్స్ యూనియన్ వ్యతిరేకించింది. ఎల్ఐసీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకులు, ఏజెంట్లతో సంప్రదింపులు, చర్చలు లేకుండా ఏకపక్షంగా కొత్త విధానాన్ని ప్రారంభించడాన్ని నిరసించారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు గొట్టాపు రవికిశోర్, జె.గోపి, బి.రామ్మోహన్‌రావు, వై.ఎస్.కనకారావు, తాళం సురేష్, కోడె రాంబాబు, సీఐటీయు నాయకులు బొడ్డేపల్లి చంద్రశేఖర్, చక్రాల అమర్‌కుమార్, సుబ్బారావు, శ్రీనివాస్, హనుమంతరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ కమిటీ ఎంపిక



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

భీమడోలు, అక్టోబరు 4: కాంగ్రెస్ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. భీమడోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యర్రా ఏడుకొండలు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి వింత సంజీవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ మోహనరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిడదవోలు ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు,ఉంగుటూరు నియోజకవర్గ యువజన అధ్యక్షుడు యర్రంశెట్టి నాగబాబు, పాపారావు, విజయ్, అచ్యుతం, ఏలూరు నగర ఉపాధ్యక్షులు తాళ్లూరు చక్రవర్తి, నాగేంద్రబాబు, మహిళా విభాగం నేతలు వై.షర్మిల, ఎస్.లక్ష్మి, తదితరులు పాలొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వినికిడి యంత్రాలు పంపిణీ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

ఏలూరు క్రైం, అక్టోబరు 4: ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ సుధాకర్ స్వరూప్ చారిటబుల్ ట్రస్టు ద్వారా జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో శుక్రవారం వినికిడి యంత్రాలు అందజేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు జిల్లా ప్రభుత్వ ప్రధాన పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమన్నారు. పిల్లలందరు ఈ యంత్రాలు జాగ్రత్తగా వాడుకుని లోపం నివారణకు ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేంద్ర కృష్ణ, చిన్న పిల్లల వైద్య నిపుణులు శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్ ఆల్బర్ట్, మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

పంట బోదెలో పరిశ్రమల వ్యర్థాలు.. రైతుల ఆందోళన

ఉంగుటూరు, అక్టోబరు 4: ఉంగుటూరు రైల్వే గేటు దాటిన తర్వాత మురుగు బోదెలో పరిశ్రమల వ్యర్థాలను వదులడంతో రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైతులు పంచాయతీకి ఫిర్యాదు ఇవ్వడంతో పరిశ్రమల యజమానులకు నోటీసులు ఇచ్చారు. పంచాయితీ పెద్దల సమక్షంలో పంటబోదెను తవ్వించడంతో పాటు ఎటువంటి దుర్వాసన రాకుండా చూసే బాధ్యత తమదేనని యజమానులు తెలిపారు. స్థానిక యువకుడు పుట్టా కుమార్ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేయడంతో సిబ్బంది పేపర్ మిల్స్ వారికి నోటీసు ఇచ్చారు. 15 రోజులలో వివరణ ఇవ్వాలని పర్యావరణ ఇంజనీర్ కటకం వెంకటేశ్వరరావు కోరారు.

నేటి నుంచి ప్రజలతో ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, అక్టోబరు 4: నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తొలుత లింగపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. వారానికి ఒక మండలం చొప్పున నాలుగు మండలాల్లో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమస్య ఏదైనా ఎమ్మెల్యే దృష్టికి తెస్తే ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కరిస్తారని క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.



ఏలూరు, బుట్టాయగూడెం, ద్వారకాతిరుమల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు, జీలుగుమిల్లి తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఉచిత ఇసుక ఏదీ?

అమలు కావడం లేదని సీపీఎం నిరసన

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 4: ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎటువంటి చార్జీలు లేకుండా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నగర కార్యదర్శి పి.కిశోర్, నేతలు తహసీల్దార్ శేషగిరికి అందజేశారు. కిశోర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీ అమలు చేయడం లేదన్నారు. బ్లాక్‌మార్కెట్‌లో ఇష్టం వచ్చినట్టు దళారులు ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఇసుక కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని, భవన నిర్మాణ కార్మికులకు భారమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, టీవీఎస్.ప్రసాద్, ఎం.అరుణకుమారి, భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు చంద్రశేఖర్, బాలాజి, కాశేశ్వరరావు, షరీఫ్, కిరణ్‌కుమార్, మీసాల సత్యం, యేసుబాబు, సత్యనారాయణ, మొహిద్దీన్, గోపి, కుమార్ పాల్గొన్నారు.

● పెదపాడు: ఉచిత ఇసుక విధానం పేరుతో గతం కంటే ప్రజలపై భారం వేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని ఆచరణలో అమలు చేయాలని, భవన నిర్మాణ రంగానికి చెందిన సామగ్రి ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇళ్లస్థలాల్లో పేదలకు ఇళ్లు ఉచితంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశిల్దారు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రభుత్వం ఉచిత ఇసుకను అందుబాటులోకి తెచ్చి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని సీపీఎం జిల్లా నాయకులు ఆర్‌వీ.సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఇసుకను సామాన్యులపై పెనుభారం మోపిందని, కూటమి ప్రభుత్వంవస్తే ఉచిత ఇసుక విధానం తీసుకువస్తామని హామీ ఇచ్చిందని, ప్రస్తుతం ఈ ప్రాంతంలో గతం కంటే ఎక్కువ ధరకు ఇసుక విక్రయిస్తున్నారన్నారు. దీని వలన అనేక మంది ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని, ఇప్పటికే భవన నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయని, వీటికి తోడు ఇసుక కూడా అధిక ధరకు కొనుగోలు చేయలేక నిర్మాణ వ్యయం భారీగా పెరిగి నిర్మాణాలు నిలిచిపోయాయని, దీనివలన కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉచిత ఇసుక విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

● బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానం పేరుతో గతం కంటే ఇసుక ధరలను విపరీతంగా పెంచి అందుబాటులో లేకుండా చేసిన ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని పేరులో కాకుండా ఆచరణలో చూపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగమణి, అందుగుల ప్రాన్సిస్, కారం భాస్కర్, తామా ముత్యాలమ్మ, కోర్స జలపాలు, పోలోజు నాగేశ్వరావు, కూరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం పేరుకు మాత్రమే ఉందని, గత ప్రభుత్వం కంటే ఎక్కువ ధరకు ఇసుకను విక్రయిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుకను అందించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత ఇసుక విధానం అమలు చెయ్యాలి

● జీలుగుమిల్లి: ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం అమలు చెయ్యాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం ప్రజలకు భారంగా మారిందని తహసీల్దారు బి.సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. సీహెచ్.సీతారామయ్య, సీహెచ్.కొండలరావు, ఎన్.అప్పారావు, కె.దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఉచిత ఇసుక వాగ్దానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా నేత లింగరాజు అన్నారు. ద్వారకాతిరుమలలో సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కట్టా భాస్కరరావు, ఆదికృష్ణ, బండారు శివాజీ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులంతా నిరసన తెలిపారు. ఇసుక అందుబాటులోలేక నిర్మాణ పనులన్ని నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఉచిత ఇసుకను అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బొరగం శ్రీనివాస్ ప్రమాణస్వీకారంలో జిల్లా నేతలు



ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌ను అభినందిస్తున్న నేతలు

పోలవరం, అక్టోబరు 4 : ట్రైకార్ చైర్మన్‌గా విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్‌కు శుక్రవారం టీడీపీ నేతలు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక వాహనాలలో విజయవాడ ప్రమాణ స్వీకారానికి బయల్దేరి వెళ్ళిన టీడీపీ నేతలు శ్రీనివాస్‌ను సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, బీసీ సంఘ అధ్యక్షుడు డోకల నాగేశ్వరరావు, పోతుల శ్రీను, పట్టిసీమ సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, మంగిన కొండ, ఆకుల రాజా, వినోద్, పిల్లి నాగరాజు, మజ్జి అప్పారావు, చెల్లూరి పవన్ మణి కంఠ, బీజేపీ మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, జనసేన నాయకులు చెంచాని రత్నప్రసాద్, వారాడి సత్తిబాబు, గునపర్తి చిన్ని, మామిడిపల్లి వరప్రసాద్, చీకట్ల సాయి, కోటం లక్ష్మణరావు, మల్లీడి సునీల్, వీరపరాజు సత్తిబాబు, ఉడతా గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఏపీ ట్రైకార్ చైర్మన్‌గా బొరగం శ్రీనివాస్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీకోసం కష్టపడిన బొరగం శ్రీనివాస్‌కు తెలుగుదేశం పార్టీ గుర్తించి పదవి ఇచ్చారని అభినందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్యనారాయణ, చుంచు సత్యనారాయణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ట్రైకార్‌కు పూర్వవైభవం తేవాలని, గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మొగపర్తి సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, కుందుల శ్రీనివాస్, ఆలపాటి ఫణి కిశోర్, సున్నం నాగేశ్వరావు, కోర్స వెంకటేశ్వరావు, మనెల్లి బాలు, కూచిపూడి రమేష్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు : బడేటి చంటి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 4: దశలవారిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయన్నారు. ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలు ఏదైన సమస్యలుంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు.

నాయక కులస్తులకు న్యాయం చేయాలి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి సమస్య వివరిస్తున్న నేతలు

కామవరపుకోట, అక్టోబరు 4: నాయక కులస్తులకు సర్టిఫికెట్ల మంజూరులో ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కు పలువురు వినతిపత్రం ఇచ్చారు. మంత్రి ఫరూక్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌కు ఘంటా సుధీర్‌బాబు, నేతలు శుక్రవారం సమస్య వివరించారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని నాయక కులస్తులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని పల్లా శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బొబ్బిలి డాన్ దివాకర్, గోధుమ రామకృష్ణ, గోధుమ మురళీ, బింగి యేసు, గోధుమ శివ, బొబ్బిలి విల్సన్ తేజ ఉన్నారు.

ప్రసాదాల తయారీకి రూ.5 లక్షల విలువైన పాత్రలు



పాత్రలను అందిస్తున్న దాత కుటుంబం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4: చినవెంకన్న ఆలయంలో ప్రసాదాల తయారీ విభాగానికి దాత రూ.5 లక్షలు విలువైన పాత్రలను శుక్రవారం అందజేశారు. ఏలూరు షణ్ముఖ ఫైనాన్స్ వారు ఈ విరాళాన్ని ఆలయ డిప్యూటీ ఈవో బాబూరాబుకు అందజేశారు. కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం పాత్రలను ప్రసాదాల తయారీ విభాగానికి తీసుకెళ్లి అప్పగించారు.

సీఆర్ఆర్ పీజీ కళాశాలలో రక్తదాన శిబిరం

ఏలూరు అర్బన్, అక్టోబరు 4: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీఆర్ఆర్ పీజీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసీమియా, సికల్‌సెల్ ఎనీమియా బాధిత చిన్నారుల రక్తమార్పిడికి వినియోగిస్తున్నట్టు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి వివరించారు. మొత్తం 35మంది విద్యార్థులు రక్తదానమిచ్చారని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, రెడ్‌క్రాస్ వైద్యాధికారి ప్రసాదరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ, డాక్టర్ స్పందన పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలి

జీలుగుమిల్లి, అక్టోబరు 4: పామాయిల్ రైతుల సమస్యలు పరిష్కరించాలని పామాయిల్ రైతు సంఘం నాయకులు చాత్రాతి ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పామాయిల్ కాటా వేసి అమ్మిన ఐదు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ కావాలన్నారు. పొలం నుంచి కాటా వరకు 5కిలో మీటర్లు దాటితే వాహన కిరాయి చార్జీలు ఇవ్వాలన్నారు. ప్రతీ విషయాన్ని రైతులకు యాప్ ద్వారా సెల్ మెసేజ్ పంపాలన్నారు. టన్నుకు సుమారు 18,500 ధర ఇవ్వాలన్నారు. పామాయిల్ రైతులకు ఆరోగ్య బీమా, జీవిత బీమా కల్పించాలన్నారు.



గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన రాట్నాలమ్మ, కుంకుళ్లమ్మ, పత్తేబాద కనకదుర్గ, కె.కోట లలితాదేవి, చింతలపూడి రాజరాజేశ్వరి దేవి, జీలుగుమిల్లి జగదాంబ

గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

పెదవేగి, అక్టోబరు 4: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని పలు చోట్ల అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. రాట్నాలకుంట రాట్నాలమ్మ శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సకల వేదాలకు మూలం గాయత్రీదేవిని ఆరాధిస్తే మంత్రశక్తి, బ్రహ్మజ్ఞానం కలుగుతుందని అర్చకుడు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ తెలిపారు. హేమ, నీల, ధవళ, ముక్త, విద్రుమ అనే ఐదు ముఖాలతో, శంఖ, చక్ర, గద, అంకుశంతో ఉన్న అమ్మవారి భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకు న్నారు. లలితా సహస్రనామ అష్టోత్తర సహిత దేవీ ఖడ్గమాలార్చన నిర్వ హించారు. ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● ద్వారకాతిరుమల: వేదమాత గాయత్రీదేవి అలంకారంలో కుంకుళ్లమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పంచముఖాలతో, చేతుల్లో శంఖు, చక్రం, ఇత ర ఆయుధాలను ధరించి అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్లున్న కుంకుళ్లమ్మను పలువురు భక్తులు దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

● ఏలూరు కార్పొరేషన్: నగరంలో అమ్మవారి ఆలయాల వద్ద నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు గాయత్రీదేవి, గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తుల అమ్మవారిని దర్శించుకున్నారు. అంబికాదేవికి లక్ష కుంకుమార్చన జరిపించారు. సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో కుంకుమార్చన చేశారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ గజలక్ష్మిగా దర్శనమిచ్చారు. పత్తేబాద కనకదుర్గమ్మను గాయత్రిదేవిగా అలంకరించారు. దక్షిణపు వీధి, అగ్రహారం, పవరుపేట, రామచంద్రరావుపేట, అశోక్‌నగర్, ఎస్‌ఆర్‌పేట, వెలక్కాయల సందు, తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద దేవీ నవరాత్రులు రెండో రోజు శుక్రవారం ఘనంగా కొనసాగాయి.

● కామవరపుకోట: శ్రీలక్ష్మీ హయగ్రీవ లలితా శ్రీపీఠంలో శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం లలితాదేవి బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పీఠం వ్యవస్థాపకులు దర్గబాబు, శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆడమిల్లి కంచి కామాక్షి ఆలయం, తడికలపూడి బస్టాండ్ సెంటర్, జీలకర్రగూడెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద జమిందార్ రాజా రాఘవరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్ళచెరువు, గుంటుపల్లి, రామన్నపాలెం, రావికంపాడు గ్రామాల్లో దేవీ నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలో గంగానమ్మ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీకన్యకా పరమేశ్వరి గాయత్రీదేవిగా, నూకాలమ్మ బాలా త్రిపుర సుందరిగా, విజయదుర్గ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

● చింతలపూడి: విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, చండీ పారాయణ, బాలల పూజ, సాయంత్రం శ్రీచక్ర నవ వర్ణార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేగి లింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాత కాశీ అన్నపూర్ణాదేవి అలంకరణతో దర్శనమిచ్చారు. మెరక వీధి, పలు సెంటర్లలో అమ్మవారి పీఠాలుపెట్టి నవరాత్రి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

● పోలవరం: మండలంలో పలు గ్రామాల్లో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బస్ షెల్టర్ వద్ద కనకదుర్గ, వాసవీ కన్యకా పరమేశ్వరి, నూతనగూడెం కనకదుర్గ, బంగారమ్మపేట కనకదుర్గ, పట్టిసీమ మంగళ చండికా, పాతపట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల, వింజరం, ఎల్ఎన్‌డీపేట కనకదుర్గ ఆలయాలు, వెంకటాపురం ముత్యాలమ్మ ఆలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజాదికాలు నిర్వహించారు. సామూహిక లలితా సహస్రనామార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు.

● ఉంగుటూరు: మండలంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. చల్లాలమ్మ ఆలయంలో చండీహోమం, శ్రీచక్ర యంత్రార్చన నిర్వహించారు. భద్రకాళీ ఆలయంలో భవాని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయం, చేబ్రోలు సాయిగాయత్రి ఆలయంలోను సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఉంగుటూరు చల్లాలమ్మ బ్రహ్మచారిణి అవతారమెత్తారు.

● జీలుగుమిల్లి: జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాద్, చిరంజీవి శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు యుశారు. అమ్మవారిని రెండో రోజు గాయిత్రి దేవిగా అలంకరించారు.

జంగారెడ్డిగూడెంలో దసరా ఆఫర్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 4: దసరా వచ్చిందంటే మార్కెట్‌లో ప్రత్యేక ఆఫర్లు హోరెత్తిస్తారు. పట్టణంలో దసరా సందర్భంగా ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాల విక్రయాల్లో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. ఒక రెస్టారెంట్ కూడా భోజనప్రియులకు నోరూరించే ఆఫర్ ప్రకటించింది. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో శనివారం ఒక రెస్టారెంట్ ప్రారంభోత్సవంతో పాటు దసరా కానుకగా చికెన్ బిర్యానీ కేవలం మూడు రూపాయలకే అందిస్తామని ప్రకటించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే ఈ ఆఫర్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీనితో పాటు రూ.290 ధరకు ఒక వ్యక్తి తిన్నంత బిర్యానీ, రూ.380 ధరకు ఒక వ్యక్తి నిర్ణీత నాలుగు రకాల స్టార్టర్ ఐటెమ్స్‌లో ఏవైనా ఎంతైనా తినవచ్చు. రూ.580 ధరకు ఇద్దరు వ్యక్తులకు మెనూలో ఉన్న 30 రకాల ఫుడ్ ఐటెమ్స్ ఎంతైనా తినవచ్చు. ఒక వ్యక్తి రూ.680 ధరకు రెస్టారెంట్‌లో 400 రకాల ఐటెమ్స్‌లో ఏవైనా ఏంతైనా తినవచ్చు. మరో వంద అదనంగా చెల్లిస్తే 20 రకాల మాక్‌టైల్స్, కూల్‌డ్రింక్స్ ఎన్నైనా తాగవచ్చని నిర్వాహకులు ప్రకటించడంతో భోజనప్రియులు లొట్టలు వేస్తున్నారు.

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా వెంకటరమణ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 4: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా కొమ్మినేని వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మిని కమిషనర్ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ మేనేజరుగా పనిచేస్తున్న వెంకటరమణను పదోన్నతిపై కమిషనర్‌గా నియమితులయ్యారు. మున్సిపల్, సచివాలయాల సిబ్బంది కమిషనర్‌ను కలిశారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్‌గా సీహెచ్.దుర్గాప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి : చింతమనేని

పెదవేగి, అక్టోబరు 4: పోలీసులు శాంతి భద్రతలను పరిరక్షించాని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నూజివీడు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కేవీవీఎన్‌వీ.ప్రసాద్ శుక్రవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి, ఈరోజున చేసిన తప్పులకు ఫలితం అనుభవిస్తున్నారని చెప్పారు. పార్టీనాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు

పెదపాడు, అక్టోబరు 4: పెదపాడు ఎంపీడీవోగా మహ్మద్ అమీలు జమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అత్తిలి నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సత్యవోలు క్యాంపు కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

● జీలుగుమిల్లి: జీలుగుమిల్లి ఎంపీడీవోగా కె.వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె పోలవరంలో పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ప్రసాద్ జంగారెడ్డిగూడెం వెళ్లారు.

● కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ఎంపీడీవోగా కె.కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన తణుకు ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై కొయ్యలగూడెం వచ్చారు. ఏవోగా కె.శ్రీనివాసరావు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

వెలుగు ఏపీఎంగా సురేష్

దెందులూరు, సెప్టెంబరు 4: మండల వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌గా పులి సురేష్ నియమితులయ్యారు. ఇక్కడి ఏపీఎం వేణుగోపాల్ ఏలూరు రూరల్ మండలానికి బదిలీ అయ్యారు. భీమడోలు నుంచి సురేష్ బదిలీపై వచ్చారు. వెలుగు సిబ్బంది సురేష్‌కు స్వాగతం పలికారు

విద్యుత్‌శాఖ ఏఈగా శ్రీనివాసరావు

విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈగా పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఉషారాణి బదిలీ కావడంతో దెందులూరు సబ్ స్టేషన్‌లో సబ్ ఇంజనీర్ శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఏఈగా నియమించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం దసరా వేడుకలు జరిగాయి. పండుగ విశిష్టతను తెలియజేసే సాంస్కృతిక ప్రదర్శనలతో కళాశాల ప్రాంగణంలో ఫార్మసీ విద్యార్థులు సందడి చేశారు.
- **ఏలూరు రూరల్ :** చాటపర్రులోని 9,10 వార్డుల్లో మురుగునీరు పారుదల లేక ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఉగ్గల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చాటపర్రులో మురుగుడ్రెన్‌లు పరిశీలించారు.
- ఏలూరు జనసేనపార్టీ కార్యాలయంలో అయ్యప్పస్వామి పడిపూజ, భజన కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్ష, పల్లెపల్లెకు తీసుకువెళ్ళాలనే ఉద్దేశంతో పడిపూజ నిర్వహించారు. రెడ్డి అప్పలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన నాయకులు నారాశేషు తలపెట్టిన ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి ఏడు రోజులు శ్రీనివాస వైభవోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- **పెదపాడు :** వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ మౌలిక సదుపాయాలు - భారతదేశ సమగ్రతకు నూతన వ్యూహం అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.
- **ద్వారకాతిరుమల :** వకుళమాత అన్నప్రసాద భవన పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. భవన సమీపప్రాంతంలో వీధికుక్క నాలుగు రోజులక్రితం చనిపోయింది. కుళ్లి కంపుకొడుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని భక్తులు చెబుతున్నారు. దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

'టెట్'కు 48 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 : ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో(టెట్) భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లాలో జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 185 మంది అభ్యర్థులకు 159 మంది, మధ్యాహ్నం 185 మందికి 163 మంది హాజరయ్యారని వివరించారు. మొత్తం 48 మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదన్నారు. ఈ పరీక్షలు ఈ నెల 21న ముగుస్తాయి. దసరా పండుగ సందర్భంగా 11, 12 తేదీల్లో పరీక్షలు ఉండవు.

రేపటి నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 4 : ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర మహాసభలు ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో నిర్వహిస్తున్నారు. ఈ మహాసభల పోస్టర్లను శుక్రవారం ఏలూరులో డీఈవో అబ్రహం ఆవిష్కరించారు. మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి మహాసభల్లో మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా నాయకుడు జి.కృష్ణ మాట్లాడుతూ ఏపీటీఎఫ్-1938 ఆవిర్భవించి 8 దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా పలు విద్యా విషయాలపై నిర్మాణాత్మక చర్చలు, తీర్మానాల ఆమోదం జరుగుతాయని వివరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహన్, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరి, నాగేశ్వరరావు, త్రినాథరాజు తదితరులు పాల్గొన్నారు.



4పెంటపాడు4: డాక్టర్ రామకృష్ణను సత్కరిస్తున్న నిట్ ఆచార్యులు

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 4 : విద్యార్థులు ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలని , నైపుణ్యాలను మెరుగు పరుచు కోవాలని తిరుపతి ఐఐటీ డీన్ అకడమిక్ అఫైర్స్ డాక్టర్ రామకృష్ణ గోర్తి అన్నారు. ఏపీ నిట్‌లో శుక్రవారం సంస్థ విభాగం ఈసీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీప్ లెర్నింగ్ అండ్ కంప్యూటర్ విజన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈసీఈ విద్యార్థులకు డీఆర్‌డీవో, ఈసీఐఎల్, బీఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్ యువరాజు అధ్యక్షత వహించగా ఆచార్యులు కిషోర్ కుమార్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అనంతరం రామకృష్ణను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు.డీన్‌లు డాక్టర్ కురుమయ్య, డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, ఆచార్యులు జీ.కిరణ్‌కుమార్, కృష్ణచైతన్య నర్సింహరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన రాష్ట్రస్థాయి జట్టు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేత పశ్చిమ

పెదవేగి, అక్టోబరు 4 : క్రీడాకారులు భవిష్యత్ ఉన్నతంగా, ఉజ్వలంగా ఉంటుందని గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎన్.భారతి అన్నారు. పెదవేగి ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 19 ఏళ్ల విభాగం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాల, బాలికల జట్లు విజేతగా నిలిచాయి. 19 ఏళ్ల బాలుర విభాగంలో ప్రథమస్థానంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు నిలవగా, శ్రీకాకుళం జట్టు రెండోస్థానం, గుంటూరు మూడవ స్థానం, కృష్ణాజిల్లా నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమస్థానం సాధించగా కృష్ణా జిల్లా రెండు, గుంటూరు మూడు, కడప జిల్లా నాలుగోస్థానంలో నిలిచాయి. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో జాతీయస్థాయిలో ఆడే రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. జిల్లా సమన్వయకర్త (డీసీవో) భారతి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి కార్యక్రమాల్లో క్రీడాకారులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. పీఈటీ గురుమూర్తి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పీడీలు పాల్గొన్నారు.

నడక పోటీల్లో పంగిడిగూడెం టీచర్‌కు ప్రథమ స్థానం



ద్వారకాతిరుమల, అక్టోబరు 4: రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల ఆటల పోటీల్లో పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయని నడక పోటీలో ప్రథమస్థానం సాధించారు. గుంటూరులో జరిగిన నడక పోటీల్లో 45 ప్లస్ విభాగంలో పైడి రాజేశ్వరి మొదటి స్థానం కైవసం చేసు కున్నారు. వీరిని మండల యూటీఎఫ్ నాయకులు గెడ్డం దేవానంద రావు, శ్రీనివాసరావు, జయరాజు తదితరులు అభినందించారు.



ఏపీ స్టేట్ లెవల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచిన న్యాయవాదులను సత్కరిస్తున్న న్యాయమూర్తులు

బ్యాడ్మింటన్ పోటీలలో న్యాయవాదుల ప్రతిభ

భీమవరం క్రైం, అక్టోబరు 4 : న్యాయవాదులు కోర్టుల్లో కేసులు వాదిస్తూ మానసికంగా అలసటకు గురవుతుంటారని వారికి ఆటలు ఉల్లాసాన్ని, శారీరక ఆరోగ్యాన్ని కలగజేస్తాయని ప్రతీ న్యాయవాది సమయం దొరికినప్పుడు ఆటలు ఆడటం ఆరోగ్యానికి ఎంతో మంచిదని న్యాయమూర్తులు సోమశేఖర్, అప్పల స్వామి, సురేష్‌బాబు, ధనరాజులు అన్నారు. గనెల 28, 29 తేదీలలో రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ స్టేట్ లెవల్ అడ్వకేట్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో భీమవరం న్యాయవాదులు పమ్మి రాధా కిరణ్మయి, బోకూరి సునీత ఉమెన్స్ డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచారని, అలాగే మట్టా చంద్రశేఖర్ వంశీ, రాధా మిక్సిడ్ డబుల్స్‌లో రన్నర్స్‌గా నిలిచారని, తరుణ్ కూడా పోటీలలో మంచి ప్రతిభ కనబరిచారని భీమవరం బార్ అసోసియేషన్ తెలిపింది. శనివారం భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోక్సో కోర్టు ఆవరణలో అభినందన సత్కార సభ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో భీమవరం న్యాయవాదులు విజయకేతనం ఎగురవేయడం బార్ అసోసియేషన్‌కు గర్వకారణమన్నారు. ట్రెజరర్ పరాలరావు, కడలి భాగ్యలక్ష్మీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

వ్యవసాయ కేబుళ్లే టార్గెట్



పెరుగుతున్న చోరీలు
ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
పోలీసులకు ఫిర్యాదులు
అయినా ఆగని దొంగతనాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 4 : జిల్లాలో కొంతకాలంగా పొలాల్లోని వ్యవసాయ కేబుళ్లనే టార్గెట్ చేస్తూ కేటుగాళ్లు వాటిని తస్కరించి సొమ్ము చేసుకుంటున్నారు. బాధిత రైతులు పోలీసులను ఆశ్రయించిన ఫలితం ఉండడం లేదు. తాజాగా గురువారం రాత్రి మండలంలో పలువురు రైతులకు చెందిన కేబుళ్లను చోరీ చేయడంతో వారు లబోదిబోమంటు న్నారు. బాధిత రైతులు శుక్రవారం ద్వారకా తిరుమల పోలీసులను ఆశ్ర యించారు. రామన్నగూడెం రెవెన్యూ పరిధిలోని రైతుల భూముల్లో సుమారు రూ.60 వేల విలువైన దాదాపు 200 మీటర్ల వైరును తస్క రించారు. తరచూ కేబుళ్లను చోరీ చేస్తుండ డంతో బోర్ల కింద సాగవుతున్న కోకో, కొబ్బరి, వరి, పామాయిల్ తదితర పంటలకు నష్టం వాటిల్లుతోందని బాధిత రైతులు ఈదల సుబ్బారావు, షేక్ ఇస్మాయిల్, ముళ్లపూడి శ్రీను, ఘంటా రాంబాబు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. గతనెలలోనూ 30 నుంచి 40 మంది రైతుల పొలాల్లో కేబుళ్లు తస్కరణకు గురయ్యాయి. ఇంచుమించు ప్రతీ నెలలోనూ ఇలా కేబుళ్లను కేటుగాళ్లు దొంగిలించి తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు వాపోతు న్నారు. కేటుగాళ్లు వీటిని కేజీల లెక్కన అమ్ముకుంటున్నారని తాము మాత్రం మోటార్లకు మరల కేబుళ్లను అమర్చాలంటే వ్యయప్రయాసలకు లోనవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. గత జూలైలో రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారి గూడెంలో దాదాపు 15 మంది రైతుల వ్యవసాయ బోర్ల వద్ద ఒక్కో బోరు వద్ద నుంచి 40 నుంచి 50 మీటర్ల విద్యుత్ వైర్లు తస్కరణకు గురయ్యాయి. వాటి మొత్తం విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. ఈ మేరకు వారంతా పోలీస్‌స్టేషన్‌లో అప్పుడే ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. పోలీసులు కేబుళ్ల చోరీ దొంగలను అరికట్ట లేక పోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కేబుల్ దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



పేరుపాలెం సౌత్‌లో వాటర్ ప్లాంట్‌కు కుళాయి నీరు తోడుతున్న దృశ్యం

ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌కు కుళాయి నీరు

మొగల్తూరు, అక్టోబరు 4: ప్రజలకు తాగునీరు చేరవేసే మంచినీటి పైప్ లైన్ నుంచి ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌కు అక్రమంగా నీటిని వాడుకుంటున్నా అధికారులకు పట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా 20 లీటర్ల టిన్ను రూ.20కి అమ్ముతున్నారు. తీర గ్రామం అయిన పేరుపాలెం సౌత్ పంచాయతీ నాలుగు రోడ్ల సెంటర్‌లో గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలోనే నీటిని చౌర్యం జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. శివారుకు తాగునీరు అందించాల్సిన పైప్ లైన్ నుంచి 3 అంగుళాలు పైప్‌లు అమర్చి నిత్యం వేలాది లీటర్ల నీటిని వాడుకుంటున్నారని దీనివల్ల గ్రామంలో శివారు ప్రాంతాలకు కుళాయి ద్వారా నీరు అందడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబధిత అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యుస్ ఏఈ మోహన్‌ను వివరణ కోరగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని వివరించారు.



వన్‌స్టాప్ సెంటర్ ఏవో చుక్కా నిర్మలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జడ్జి రత్న ప్రసాద్

వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన న్యాయాధికారి

ఏలూరు క్రైం, అక్టోబరు 4 : బాధితులకు అవసరమైన పక్షంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి పురుషోత్తమకుమార్ ఆదేశాలమేరకు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను రత్నప్రసాద్ సందర్శించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో ఉన్న బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సెంటర్ అందించే సేవలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సెంటర్ అడ్మిన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పంట కాల్వల్లో కలుషిత నీరు అరికట్టాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న రంగారావు

నరసాపురం, అక్టోబరు 4: వేములదీవి పంట కాల్వల్లో కలుస్తున్న మురికినీరును అరికట్టాలంటూ శుక్రవారం ఆర్డీవో దాసిరాజుకు సర్పంచా ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కూనపరెడ్డి రంగారావు వినతిపత్రం అందించారు. పట్టణంలోని చాలా డ్రెయినేజీల నీరు ఈ కాల్వలో కలవడం వల్ల ఇదే నీరును లక్ష్మణేశ్వరం ప్రాజెక్టులోకి ఎక్కిస్తున్నారన్నారు. సరైన ఫిల్టర్‌బెడ్‌లు లేకపోవడం వల్ల చాలామంది ప్రజలు కలుషిత నీరును తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. కలుషిత నీరు కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆర్డీవోకు విన్నవించారు. త్వరలో కాల్వను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



బల్లిపాడు మదనగోపాలస్వామి ఆలయం వద్ద గ్రామస్థుల ఆందోళన

బల్లిపాడు మదన గోపాలస్వామి ఆలయ నిధులు గోల్‌మాల్

ఆలయం వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్థులు, రైతులు

అత్తిలి, అక్టోబరు 4: అత్తిలి మండలం బల్లిపాడు మదన గోపాలస్వామి దేవాలయంలో రూ.50 లక్షల వరకు ఈవో గోల్‌మాల్ చేశారంటూ గ్రామస్థులు ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆలయానికి సుమారు 135 ఎకరాలు పొలం ఉంది. ఈ పొలాన్ని గ్రామస్థులు కౌలుకు చేస్తుంటారు. ఆలయంలో ఉన్న కాలక్షేపమండపం వివాహాలకు అద్దెకు ఇస్తుంటారు. గత ఐదు సంవత్సరాల్లో కేవలం 2 సార్లు మాత్రమే అద్దెకు ఇచ్చినట్లు ఈవో రికార్డు చేయడం పట్ల కమిటీ సభ్యులు ఆశ్చర్యపోతున్నారు. భక్తులు సమర్పించిన విరాళాలకు రశీదులు ఇవ్వకపోవడం, దేవస్థానం భూములకు సంబంధించి కౌలు డబ్బులు బ్యాంకులో జమ చేయకపోవడం పట్ల గ్రామస్థులకు అనుమానం వచ్చి గ్రామ పెద్దలతో కలిసి ఈవో హరి గోపీనాథ్‌ను నిలదీశారు. బదిలీపై వెళుతున్న ఈవోను శుక్రవారం ఆలయం వద్ద నిధులు దుర్వినియోగంపై ఆరా తీశారు.గత మార్చిలో జరిగిన స్వామి వారి కల్యాణం నిమిత్తం దాతలు అందించిన విరాళాలకు రసీదులు ఇవ్వక పోవడం, పీఆర్‌సీ అమలు చేయడానికి ఆలయ అర్చకుల నుంచి డబ్బులు వసూలు చేయడం,ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకుండానే నిధులు వినియోగించడం వంటి విషయాలపై నిలదీశారు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అధికారులు పూర్తి విచారణ చేయాలంటున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎస్‌ఐను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.



తెలుగు విజయం సాహిత్య సభలో పాల్గొన్న ప్రముఖులు

మహా పురుషుడు శ్రీకృష్ణ దేవరాయలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 4 : ప్రపంచ దేశాలలో తెలుగు భాషకు, ఔన్నత్యానికి వైభవం తెచ్చిన మహాపురుషుడు శ్రీకృష్ణ దేవరాయలు అని పలువురు వక్తలు అన్నారు. స్థానిక రసధుని సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్షత్రియ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు వైభవం అనే సాహిత్య రూపకాన్ని ప్రదర్శించారు. దీనిలో నారాయణ భట్టుగా గురు సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్, ప్రబంధ కవిగా డాక్టర్ అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు, అవధాన కవయిత్రిగా డాక్టర్ బులుసు అపర్ణ, నాటక కవిగా చేగొండి వెంకటసత్యనారాయణమూర్తి, విప్లవ కవిగా ప్రముఖ వ్యాఖ్యాత చక్రావధానులు రెడ్డప్ప ధవేజీ పాల్గొని ఆసక్తికరంగా రూపకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు కొట్టి భాస్కర రావు అధ్యక్షత వహించగా, గౌరవాధ్యక్షుడు పెద్దిబోట్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి జయ దుర్గారావు, కోశాధికారి యర్రంశెట్టి వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులు, క్షత్రియ సంక్షేమ పరిషత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ సుధాకరరావుకు పత్రాలను అందిస్తున్న దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ, ప్రతినిధులు

చిన వెంకన్న ఆలయంలో పసిడి కాంతులు

రూ.1.64 కోట్లతో బంగారు తాపడం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4: ద్వారకాతిరుమల వేంటేశ్వరస్వామి గర్భాలయం పసిడి కాంతులతో శోభిల్లుతోంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.1.64 కోట్లు ఖర్చుచేసి శ్రీవారి గర్భగుడి అంతా బంగారు రేకులతో శిల్పకళ ఉట్టిపడేలా తాపడం చేయించింది. ఈ పనులు శుక్రవారంతో పూర్తవడంతో ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాథాచార్యులు పరిశీలించారు. కంపెనీ డైరెక్టర్లు, ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం శుక్ర వారం బంగారు తాపడాన్ని స్వామివారికి అందజేస్తున్న పత్రాలను చైర్మన్‌కు అందించారు.



తాడేపల్లిగూడెం పూల విక్రయ దుకాణం

కొండెక్కిన పూల ధరలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 4: దసరా నవరాత్రుల సీజన్‌తో పూల ధరలు కొండెక్కాయి. మొన్నటి వరకూ నిలకడగా ఉన్న ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. చామంతుల కేజీకి రూ.100 నుంచి 300కి ఎగ బాకగా,తెల్ల చామంతి రూ.200 నుంచి రూ.350కి విక్రయిస్తున్నారు. బంతి పూలు రూ.50 నుంచి 80కి, ఎర్రబంతి రూ.50 నుంచి 80కి, స్టార్ గులాబీలు కేజి రూ.150 నుంచి రూ. 300కి అమ్ముతున్నారు. శరన్నవ రాత్రుల్లో పూల ధరలు భక్తులను బెంబేలెత్తిస్తున్నాయి.



సిద్ధాంతంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉచిత ఇసుక అమలు చేయాలి

పెనుగొండ, అక్టోబరు 4 : కూటమి ప్రభుత్వం హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్ధాంతం రావిచెట్టు సెంటర్ వద్ద ఇసుక ర్యాంప్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బలరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక అందుబాటులో లేక తాపీ, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, రాడ్‌బెడ్డింగ్, వంటి 50 రకాల లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక రోడ్డు పడ్డారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని లేని పక్షంలో ఉద్యమిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, కండెల్లి సోమరాజు, చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. పలువురికి జరిమానా

భీమవరం క్రైం, అక్టోబరు 4 : బహిరంగంగా మద్యం తాగడం కానీ, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ అన్నారు. ఈనెల 2వ తేదీన చినఅమిరంలో రాత్రి సుమారు పది గంటల సమయంలో మద్యం తాగి బైక్ నడుపుతున్న పి.శ్రీనును ఆపి తనిఖీ చేపట్టారు. అనంతరం శుక్రవారం భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.పదివేలు జరిమానాను విధించింది. పలు ప్రదేశాలలో బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరినామాను విధించారని సీఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 4 : రైలుపట్టాలు దాటుతున్న ఒక వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు జ్యూట్‌మిల్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ళ వయసున్న వ్యక్తి శుక్రవారం ఉదయం రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వెళ్తున్న రైలు ఢీ కొట్టింది. ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చారు. మృతుడు నలుపురంగు పొడవు చేతుల చొక్కా, ముదురు ఆకుపచ్చ రంగు ఫ్యాంటు, సిమెంటు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ సెల్ నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

దొంగ అరెస్టు..రూ.73 వేల వస్తువుల రికవరీ

భీమడోలు, అక్టోబరు 4 : భీమడోలులో జరిగిన చోరీ కేసులో దొంగను అరెస్టు చేసి వస్తువులను రికవరీ చేశారు. భీమడోలు చల్లా వారి వీధికి చెందిన చల్లా మరియమ్మ తన భర్తతో విభేదాలు రావడంతో స్థానికంగా అద్దెకు ఉంటున్నారు. ఆగస్టు 12న తన ఇంటికి తాళం వేసి కూలీ పనుల నిమిత్తం తన అక్క ఇంటికి తణుకు వెళ్ళింది. అక్కడ పనులు పూర్తయిన తర్వాత తిరిగి అదే నెల 28న భీమడోలు రాగా ఇంటి తాళం పగలగొట్టి బట్టలలో బ్యాగులో ఉంచిన 13 తులాల వెండి పట్టీలు దొంగిలించినట్లు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ విల్సన్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సుధాకర్ విచారణ చేపట్టారు. భీమడోలు గ్రామానికి చెందిన పాత నేరస్థుడు కర్నాటి విజయ్ కుమార్ ఎలియాస్ పాండా (20)ను గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. అతని నుంచి ఒక కాసు బంగారంతో పాటు 13 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నారు.

కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు

భీమవరం క్రైం, అక్టోబరు 4 : తన భర్త, అత్తమామ, ఆడపడుచులు అదనంగా కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారంటూ భీమవరం శివారు ఆరేటినగర్‌కు చెందిన సనపల అపర్ణ భీమవరం టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అపర్ణకు ఆకివీడు మండలం కళింగగూడెం గ్రామానికి చెందిన సనపల రామారావుతో 2015లో వివాహం అయ్యింది. వివాహానికి ముందు రామారావుకు విశాఖపట్నంలో ఉద్యోగం ఉందని నమ్మబలికారు. తీరా వివాహం అయిన తరువాత ఉద్యోగం లేకపోవడంతో పాటు భర్త రామారావు, అత్త, మామ, ఆడపడుచులు అదనంగా కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సి శ్రీనివాసులు తెలిపారు.

కలిసి పుట్టారు..కలిసే చోరీలు

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న కవలలు అరెస్టు
రూ. ఐదు లక్షల చోరీ సొత్తు స్వాధీనం



విలేకరుల వివరాలు తెలుపుతున్న ఏలూరు ఎస్పీ కెపిఎస్ కిషోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 4 : వారిద్దరూ కవలలు. కలిసే నేరాలకు పాల్పడుతున్నారు. వంటరిగా నడిచి వెళ్ళే మహిళలను టార్గెట్ చేసుకుని క్షణాల్లో మహిళల మెడల్లో ఉన్న బంగారు గొలుసులను తెంపుకుని పారిపోతున్నారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు వీరిని చాకచక్యంగా అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు గ్రామానికి చెందిన సైదు రాఘవేంద్రప్రసాద్ (27), రవీంద్ర ప్రసాద్ (27) కవలపిల్లలు. వీరిద్దరు ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో రోడ్డుపై నడిచివెళ్ళే మహిళ మెడల్లో బంగారు గొలుసులను తెంపుకుని మోటారు సైకిల్‌పై పారిపోతున్నారు. ఇటీవల ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదు కావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మదీనాబాషా, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ళు లక్ష్మీ నారాయణ, ఆర్ మోహన్‌కృష్ణ, నాగార్జున, మరో టీమ్ ఇన్‌ఛార్జి అయిన నిడమర్రు సీఐ సుభాష్, సిబ్బంది కలిసి గాలింపు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఏలూరు తూర్పు వీధి మాదేపల్లిరోడ్డు ప్రేమాలయం వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా వన్‌టౌన్‌లోని కృష్ణాష్టమి రోజు రాత్రి తూర్పు వీధి వేణుగోపాలస్వామి రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపినట్లుగా వివరించారు. అదేవిధంగా వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, కైకలూరు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసుకు సంబంధించి చైన్ స్నాచింగ్ చేసినట్లుగా గుర్తించారు. వన్‌టౌన్‌లో రెండు కేసులు, టూటౌన్‌లో 1 కేసుకు సంబంధించి చోరీ సొత్తు మొత్తం మూడు చైన్లు, ఒక మోటారు సైకిల్‌ను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ ఐదు లక్షలు ఉంటుందని తెలిపారు. వీరిపై గతంలో ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు, టూటౌన్ పరిధిలో నాలుగు చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని చెప్పారు. ఈ కేసులో మేట్రిక్ సెక్యూటిరీ సర్వేలైన్స్ సంస్థ సభ్యుడు వర్మ సాంకేతిక సహకారం అందిం చారని ఎస్పీ అభినందించారు.

బైక్ ఢీ..బాలుడికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 4: రోడ్డు దాటుతుండగా బాలుడిని మోటారు సైకిల్ ఢీకొట్టడంతో బాలుడు తలకు తీవ్రగాయాలైన ఘటనపై రూరల్ పోలిస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పెదతాడేపల్లికి చెందిన తాతకుంట్ల గురుచరణ్ (11) ఈనెల 26న రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళ గిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నాడు. తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి.. రూ.47,900 స్వాధీనం

ఉంగుటూరు, అక్టోబరు 4 : గురువారం అర్ధరాత్రి చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోని నారాయణపురం శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.47,900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి

ఆచంట, అక్టోబరు 4: ఆచంట మండలం ఆచంట చినపేటకు చెందిన బద్దా నాగరాజు (34) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.వెంకటరమణ తెలిపారు. బద్దా నాగరాజు మద్యానికి అలవాటుపడి గల్ఫ్‌లో ఉంటున్న భార్య మహేశ్వరి పంపిన డబ్బులు కూడా పాడు చేస్తుండడంపై భార్య మందలించేది. వారి మనస్పర్థలు పెరిగి మనస్థాపానికి చెందిన నాగరాజు ఈ నెల 1న కలుపు కొట్టే గడ్డి మందును తాగగా వైద్యం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ శుక్రవారం మరణించి నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో దాడి

నూజివీడు టౌన్, అక్టోబరు 4: మద్యం మత్తులో దాడికి దిగిన నలుగురు నిందితులపై నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ వివరాల ప్రకారం నూజివీడులోని పెద్ద చెరువు వద్ద శ్రీను అనే వ్యక్తిపై మద్యం మత్తులో నలుగురు దాడి చేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.






నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్.. ముసునూరు, కలిదిండి తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం నాయకులు, కార్మికుల ధర్నా.. ఆగిరిపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అందని ఉచిత ఇసుక

» ఇసుక పాలసీని పకడ్బందీగా అమలు చేయాలి » సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా » పాల్గొన్న నిర్మాణ కార్మికులు

నూజివీడు టౌన్, అక్టోబరు 4: ప్రస్తుతం అమల్లో ఉన్న ఇసుక పాలసీ వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతోందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇసుక పాలసీని అమలు పరచాలని సీపీఎం ఆధ్వర్యంలో నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలిపి నూజివీడు ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారని, అయితే ప్రస్తుత పాలసీ వల్ల ఇసుక వినియోగదారులకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఫలితంగా పేదలు ఇళ్ల నిర్మాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణం ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్లు, నాయకులు సుభాష్‌చంద్రబోస్, లక్ష్మయ్య, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ఎన్నికల హామీ ప్రకారం తక్షణమే ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ముసునూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఇసుక లబ్ధిదారులకు, ఇతర నిర్మాణాలు చేసుకునేవారికి అందని ద్రాక్షాలా మారిందని, ఉచిత ఇసుక పాలసీ అమలులో ప్రభుత్వం నేటికి స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొడవలి శ్రీను, అనగాని వెంకటేశ్వరరావు, కొల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, ఉచిత ఇసుక పథకాన్ని అన్ని చోట్లా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల పనిముట్ల ధరలు నియంత్రించాలని, చిన్నాగిరిపల్లి కొండ పోరంబోకు భూమి సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఆ పార్టీ మండల కార్యదర్శి నాగరాజు, ముత్యాల నరేష్, సర్దు కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

కలిదిండి: కూటమి ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవటంతో గతంలో కంటే ఎక్కువ ధర పలుకుతుందన్నారు. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. సీపీఎం నాయకులు, భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కోతులను పట్టేందుకు రంగం సిద్ధం

ముదినేపల్లి, అక్టోబరు 4 : ముదినేపల్లి అంబేడ్కర్ నగర్‌లో కోతుల బెడద నివారించేందుకు పంచాయతీ రంగంలోకి దిగింది. కోతుల భయం శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు అంబేడ్కర్ నగర్‌లో కోతుల సమస్య పరిష్కరించేందుకు అటవీశాఖ అధికారులను సంప్రదించారు. ఈ నెల 7న ముదినేపల్లిలో కోతులను పట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.



చైర్మన్ సుధాకరరావుకు పత్రాలను అందిస్తున్న దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ, ప్రతినిధులు

చిన వెంకన్న ఆలయంలో పసిడి కాంతులు

రూ.1.64 కోట్లతో బంగారు తాపడం

ద్వారకాతిరుమల, అక్టోబరు 4: ద్వారకాతిరుమల వేంటేశ్వరస్వామి గర్భాలయం పసిడి కాంతులతో శోభిల్లుతోంది. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రూ.1.64 కోట్లు ఖర్చుచేసి శ్రీవారి గర్భగుడి అంతా బంగారు రేకులతో శిల్పకళ ఉట్టిపడేలా తాపడం చేయించింది. ఈ పనులు శుక్రవారంతో పూర్తవడంతో ఆలయ చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఆలయ ప్రధాన అర్చకులు జగన్నాధాచార్యులు పరిశీలించారు. కంపెనీ డైరెక్టర్లు, ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనం అందజేశారు. ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం శుక్ర వారం బంగారు తాపడాన్ని స్వామివారికి అందజేస్తున్న పత్రాలను చైర్మన్‌కు అందించారు.

కలిసి పుట్టారు..కలిసే చోరీలు

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న కవలల అరెస్టు



వివరాలు చెబుతున్న ఏలూరు ఎస్పీ కిషోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 4 : వారిద్దరూ కవలలు. కలిసే నేరాలకు పాల్పడు తున్నారు. వంటరిగా నడిచి వెళ్ళే మహిళలను టార్గెట్ చేసుకుని క్షణాల్లో మహిళల మెడల్లో ఉన్న బంగారు గొలుసులను తెంపుకుని పారి పోతున్నారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు వీరిని చాకచక్యంగా అరెస్టు చేశారని జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడు గ్రామానికి చెందిన సైదు రాఘవేంద్రప్రసాద్ (27), రవీంద్ర ప్రసాద్ (27) ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో రోడ్డుపై నడిచివెళ్ళే మహిళ మెడల్లో బంగారు గొలుసులను తెంపుకుని మోటారు సైకిల్‌పై పారిపోతున్నారు. ఇటీవల ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదు కావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ళు లక్ష్మీ నారా యణ, ఆర్ మోహన్‌కృష్ణ, నాగార్జున, మరో టీమ్ ఇన్‌ఛార్జి అయిన నిడమర్రు సీఐ సుభాష్, సిబ్బంది కలిసి గాలింపు చేపట్టారు. శుక్రవారం ఉదయం ఏలూరు తూర్పు వీధి మాదేపల్లిరోడ్డు ప్రేమాలయం వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా వన్‌టౌన్‌లోని కృష్ణాష్టమి రోజు రాత్రి తూర్పు వీధి వేణుగోపాలస్వామి గుడి రోడ్డులో నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపినట్లుగా వివరించారు. అలాగే వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, కైకలూరు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసుకు సంబంధించి చైన్ స్నాచింగ్ చేసినట్లుగా గుర్తించారు. వన్‌టౌన్‌లో రెండు కేసులు, టూటౌన్‌లో 1 కేసుకు సంబంధించి చోరీ సొత్తు మొత్తం మూడు చైన్లు, ఒక మోటారు సైకిల్‌ను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ ఐదు లక్షలు ఉంటుందని తెలిపారు. వీరిపై గతంలో ఏలూరు వన్‌టౌన్‌లో ఒక కేసు, టూటౌన్ పరిధిలో నాలుగు చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని చెప్పారు. ఈ కేసులో మేట్రిక్ సెక్యూరిటీ సర్వేలైన్స్ సంస్థ సభ్యుడు వర్మ సాంకేతిక సహకారం అందించారని ఎస్పీ అభినందించారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

పారదర్శకంగా రెవెన్యూ సేవలందించాలి

కైకలూరు, అక్టోబరు 4: ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో మండలంలో బదిలీ అయిన పలువురు వీఆర్వోలు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా భూసమస్యలు, ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను వేగంగా పూర్తిచేసి అందించాలన్నారు. అలాగే ఎక్కడైనా అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

వీణల తయారీకి ప్రోత్సాహకాలు



నూజివీడు టౌన్, అక్టోబరు 4: వీణల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మినిస్ట్రీస్ ఆఫ్ టెక్స్‌టైల్, హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ ప్రమోషన్ ఆఫీసర్ రవీంద్ర గౌతమ్ అన్నారు. తుక్కులూరులో వీణల తయారీ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రాచీన చేతి వృత్తి అయిన వీణల తయారీని భవిష్యత్ తరాలకు అందించేందుకు ముందుకు వచ్చిన వీణల తయారీదారు షేక్ మాబును ఆయన అభినందించారు. ఔత్సాహికులు వీణల తయారీ నేర్చు కోవాలని సూచించారు. అనంతరం హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా ఆఫీసర్ లక్ష్మీనాథ్ మాట్లాడుతూ వీణల తయారీ నేర్చుకునే వారికి ముడి సరుకును అందించటంతో పాటు శిక్షణా కాలంలో రూ.7,500లు ఇవ్వడం జరుగు తుందన్నారు. లేపాక్షి మేనేజరు కుమార్, వీణల తయారీదారు షేక్ మాబు, టీడీపీ నాయకుడు యనమదల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

కైకలూరు, అక్టోబరు 4: జాబ్‌మేళాలో 52 మంది యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ. కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడప్ జిల్లా ఉపాధి కార్యాలయం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో 236 మంది హాజరుకాగా వీరిలో 52 మంది యువత ఉపాధి పొందినట్లు తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ధ్రువీకరణపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సుజాత, ప్లేస్‌మెంట్ అధికారి కే. ప్రవీణ్‌కుమార్, కో-ఆర్డినేటర్ సురేష్, ప్రసాద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

మద్యం మత్తులో దాడి

నూజివీడు టౌన్, అక్టోబరు 4: మద్యం మత్తులో దాడికి దిగిన నలుగురు నిందితులపై నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ వివరాల ప్రకారం నూజివీడులోని పెద్దచెరువు వద్ద శ్రీను అనే వ్యక్తిపై మద్యం మత్తులో నలుగురు దాడి చేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై తేనెటీగల దాడి

తేనెటీగల దాడితో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామానికి చెందిన దొండపాటి కోటేశ్వరరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాయపాలెంలో భూమి దుక్కులకు వచ్చిన అతనిపై తేనెటీగలు దాడి చేశాయి. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో సోమేశ్వరి

నూతన ఎంపీడీవో భవనం నిర్మించండి: ఎంపీపీ

నూజివీడు టౌన్, అక్టోబరు 4: శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలంటూ నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష కోరారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ నూజివీడు ఎంపీడీవో కార్యాలయం, ఎంపీపీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి వర్షాకాలంలో నీరు కారుతున్నాయని, నూతన భవనం నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నూజివీడు మండల పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఉపాధి పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో కచ్చా రహదారుల స్థానంలో సీసీ రహదారుల నిర్మాణం, డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధితో పాటు సచివాలయ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్ బిల్లులపై చర్చించారు. అనంతరం ఉద్యానవన శాఖ పరిధిలో ఇస్తున్న పంట ప్రోత్సాహకాలు, యంత్ర పరికరాలపై సబ్సిడీలను వివరించారు. నూజివీడు వైస్ ఎంపీపీ దండుబోయిన స్వర్ణలత, ఎంపీడీవో సి.రాఘవేంద్రనాథ్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుబ్బారావు, డీటీ కిరణ్‌సింగ్, ఏపీవో సోమేశ్వరి, హెచ్‌వో హేమ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవనం నిర్మాణానికి వినతి



ముదినేపల్లి, అక్టోబరు 4 : ముదినేపల్లిలో అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలని స్థానిక జై భీమ్ భవన నిర్మాణ సంఘం నాయకులు కోరారు. సంఘ అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు, ఉపాధ్యక్షుడు లేళ్ల ప్రసాద్, సభ్యులు శుక్రవారం తహసీల్దార్ సుబానీ, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎన్‌డీఏ నాయకులకు వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక అంబేడ్కర్ నగర్, అంబేడ్కర్ కాలనీల సమీపంలో ఖాళీగా ఉన్న భూమిలో అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు పంచాయతీ తీర్మానించాలని, భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలని కోరారు. గతంలో భవన నిర్మాణానికి ఉన్నతాధికారులు పరిశీలించి ప్రతిపాదనలు కూడా రూపొందించారని అధికారులకు కమిటీ నాయకులు తెలిపారు.

చంద్రబాబును కలసిన వీరమల్లు



ముదినేపల్లి, అక్టోబరు 4 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకుడు వీరమల్లు సత్యనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రహదారులు, డ్రెయిన్ల సమస్యలను వివరించి వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం విడుదల చేయటం అభినందనీయమని చంద్రబాబుకు నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.



సంపూర్ణ ఆహార కిట్ల పంపిణీ

మండవల్లి అక్టోబరు 4: మండవల్లి అంగన్వాడీ 5, 6 కేంద్రాల్లో ఆహార పోషణ కిట్లను శుక్రవారం గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. ఎంపీటీసీ గూడపాటి ఝాన్సీ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి ఎంపీడీవోగా రామకృష్ణ



ముదినేపల్లి, అక్టోబరు 4 : ముదినేపల్లి ఎంపీడీవోగా వై.రామకృష్ణ నియమితులయ్యారు. ఇక్కడి ఎంపీడీవో మల్లీశ్వరి కృష్ణాజిల్లా నందివాడ మండలానికి బదిలీ కాగా, ఆ జిల్లాలోని పామర్రు నుంచి వచ్చిన రామకృష్ణ ముదినేపల్లిలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కలిదిండి మండలంలో వీఆర్వోల బదిలీ

కలిదిండి, అక్టోబరు 4 : మండలంలో పలువురు వీఆర్వోలు బదిలీ అయ్యారు. కొండంగి వీఆర్వో పమిడేశ్వరరావు కాళ్లపాలెం, కలిదిండి-2 వీఆర్వో పోతుమర్రు, మూల్లంక వీఆర్వో డేవిడ్ రాజు మట్టగుంట, ఎస్.ఆర్పీ అగ్రహారం వీఆర్వో ప్రియాంక చినతాడినాడ, పెదలంక వీఆర్వో జగన్మోహనరావు భాస్కరరావుపేట, కోరుకొల్లు-2 వీఆర్వో రాజబాబు మూల్లంక, మట్టగుంట వీఆర్వో ఏడుకొండలు ఎస్.ఆర్పీ అగ్రహారం, గుర్వాయిపాలెం వీఆర్వో ప్రసాదరావు కలిదిండి -1కు బదిలీ అయ్యారు. కాగా పెదలంక వీఆర్వోగా ఆంజనేయులు, గుర్వాయిపాలెం వీఆర్వోగా కాంతారావు, వెంకటాపురం వీఆర్వోగా కమల్‌లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

నేడు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

కైకలూరు, అక్టోబరు 4: కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు నోబుల్ తెలిపారు. కైకలూరు ఎంపీ యూపీ స్కూల్ ఎదురుగా ఉన్న కార్తీక్ మినీ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పాల్గొంటారని వివరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కల్యాణ్ ఎంపిక



విద్యార్థి కల్యాణ్‌తో వ్యాయామోపాధ్యాయుడు

చాట్రాయి, అక్టోబరు 4: మండలంలోని చిత్తపూరు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పారేపల్లి మధు కల్యాణ్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు. విశాఖలో జరిగే పోటీలలో ఈ విద్యార్థి ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని చెప్పారు. కల్యాణ్‌ను గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణ మండపానికి 20 ఫ్యాన్ల వితరణ

ఆగిరిపల్లి, అక్టోబరు 4: ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల గ్రామానికి చెందిన ప్రాత్రికేయుడు పత్తిపాటి సురేష్ శోభనాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపాన నిర్మించిన కల్యాణ మండపానికి రూ. 30 వేలు విలువచేసే 20 సీలింగ్ ఫ్యాన్లు తన తల్లి పత్తిపాటి రత్నకుమారి జ్ఞాపకార్థం అందించారు.

కృత్రిమ కాళ్ళ వితరణ



ఆగిరిపల్లి, అక్టోబరు 4: ఎన్ఆర్ఐ డాక్టర్ ఇమ్మాది రామకృష్ణ స్మృత్యర్థం ఆయన కుటుంబీకులు రెండు కాళ్ళు కోల్పోయిన నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళు అంజేయటం అభినందనీయమని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ విశ్రాంత అధ్యాపకురాలు ఉప్పలపాటి మణికుమారి అన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన కెల్లా రాముకు తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఆమె కృత్రిమ కాళ్ళు అందజేశారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా తదితరులు పాల్గొన్నారు.

రుణాల రికవరీ సక్రమంగా ఉండాలి



ముసునూరు, అక్టోబరు 4: డ్వాక్రా సంఘాలకు అందిస్తున్న రుణాల రికవరీ సక్రమంగా ఉండాలని వెలుగు ఏపీఎం కె.రాంబాబు అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సీసీలు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ఇచ్చే రుణాలపై ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గాయత్రిగా కోట మహిషమ్మ



బలివేలో లలితా త్రిపుర సుందరిగా



మండవల్లిలో విజయదుర్గగా



కోరుకొల్లులో గాయత్రిదేవిగా



కైకలూరు శ్రీ శ్యామలాంబ ఆలయంలో ఉభయ దాతల పూజలు



పెయ్యేరులో గాయత్రిదేవికి పూజలు

గాయత్రిగా దుర్గమ్మ

నూజివీడు టౌన్, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చారిత్రక నూజివీడు కోటమహిషాసురమర్దిని ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించగా, 68వ శరన్నవరాత్రుల్లో భాగంగా 2వ రోజు భక్తులకు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు.

చాట్రాయి: గాయత్రీదేవి అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. చాట్రాయిలో దుర్గమ్మ ఆలయం, సి. గుడిపాడు, తుమ్మగూడెం శివాలయాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవారికి పూజలు చేసి కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముసునూరు: బలివే రాజరాజేశ్వరి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముసునూరులో వేంకటాచలస్వామి ఆలయంలో పద్మావతిదేవిని గాయత్రిగా అలంకరించి పూజలు చేశారు. శ్రీ వేంకటేశ్వర తాళం భజన బృందం అమ్మవారి సహస్ర నామపారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ధనలక్ష్మిగా శ్రీశ్యామలాంబ

కైకలూరు: శుక్రవారం శ్రీశ్యామలాంబ అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పుష్పాలంకరణ పిచ్చుకల సూర్యనారాయణ దంపతులు చేశారు. భక్తులకు ప్రసాదాన్ని దాతలు దోనేపూడి విష్ణు శివనాగప్రసాద్, వరదా వెంకట శివరామకృష్ణకిషోర్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి అందజే శారు. 110 మంది దంపతులు ఉభయదాతల పూజల్లో పాల్గొన్నారు. చండీహోమంలో 20 మంది దంపతులు పాల్గొన్నారు. కైకలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం. శివకిరణ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయదాతల పూజల్లో పాల్గొన్న దంపతులను ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు శేషవస్త్రాలతో సత్కరించారు. జడ కోలాట ప్రదర్శన, లలితా సహస్ర రాగ మాలిక గానామృతం, కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శనివారంనాడు శ్రీశ్యామలాంబ అమ్మవారు ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనిమవనున్నారు. ఆటపాక శ్రీ సర్వమంగళ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. వ్యవస్థాపక కుటుంబసభ్యులు బందా సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయంలో శ్రీదేవీఖడ్గ నామపూజ, లలితా సహస్ర నామ కుంకుమపూజలను ఘనంగా నిర్వహించారు. సయ్యపురాజు గుర్రాజు దంపతులు ఉభయ దాతలుగా పూజలు చేయగా ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మండవల్లి: మండవల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు విజయదుర్గగా దర్శనమిచ్చారు. ఇంగిలిపాకలంక శివారు శ్రీరామ్‌నగర్ లోని శివగుళకాలమ్మను గాయత్రిగా అలంకరించారు. లోకుమూడి దత్తాశ్రమంలో కుంకు మార్చన, మహిళల కోలాటం పలువురుని విశేషంగా ఆకట్టుకుంది.

ముదినేపల్లి: పెయ్యేరులోని మండల కార్యాలయాల వద్ద గల దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రిగా దర్శనమివ్వగా, ఉభయ దాతలు అల్లు శ్రీధర్, గాజులపల్లి వెంకటేశ్వర రావు దంపతులు పూజలు నిర్వహించారు. దేవపూడిలో విజయదుర్గాదేవి గాయత్రిగా, గురజ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు జరిపారు. చేవూరుపాలెం పరసావారి అంకమ్మ ఆలయం, బొమ్మినంపాడు దుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

కలిదిండి: కోరుకొల్లు సోమేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవిని గాయత్రిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెదలంక నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. మూల్లంక దుర్గమ్మ గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సానారుద్రవరంలో గంగానమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

పబ్లిక్ నోటీస్
IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE
(JUNIOR DIVISION) : AT KAIKALURU
O.S.No. 135 / 2023
Between :
Chintala Krishna .... Plaintiff
AND
Chintakayala Chandra Sekahr .... Defendant
To,
Chintakayala Chandra Sekhar,
S/o. Jagannadham,
Proprties, aged 39 years,
R/o. Velampeta, Kaikalur Village and Mandal,
Eluru District, Kaikalur JCJC.,

పై నెంబరు దావాను వాది ప్రతివాదుల పై Specific performance నిమిత్తం దాకలు చేసియున్నారు. సదరు దావాలోని ప్రతివాదికి శ్రీ కోర్టు వారి నుండి ఎన్నిసార్లు దావా సమన్లు మరియు ఐ.ఎ.నెం. 300/2023 రులో నోటీసులు పంపినమూ ప్రతివాది పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు మరియు ఐ.ఎ.నెం. 300/2023 రులో నోటీసులు అమలుకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు ది. 29-10-2024వ తేదీన ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు నందు స్వయముగా గానీ, వకీలు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేనీ యెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 28-10-2024
పి. పవన్‌కాంత్, వాది తరపు న్యాయవాది
సెల్ : 94903 39161.